క్లుప్తంగా

కొత్త చట్టాలపై అవగాహన



కొనకనమిట్ల: బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష చేస్తున్న ఎస్‌ఐ

కొనకనమిట్ల: గ్రామల్లో అల్లర్లు సృష్టించి గొడవలకు కారణమౌతారో అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మాధవరావు అన్నారు. గురువారం మండలంలోని గొట్లగట్టు, పాతపాడు గ్రామాల్లో పర్యటించి శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కలిపించారు. అనంతరం పాతపాడు వద్ద ఒంగోలు–గిద్దలూరు రహదారిపై పలు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా నడిపే వాహనాలకు చలానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు రుచికర భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో గిరిధరశర్మ

రాచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంఈవో వారణాసి గిరిధరశర్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారమై రుచికరమైన భోజనాన్ని ఏర్పాటు చేయాలని వివరించారు. ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు విద్యార్థులకు ఇచ్చారా లేదా అనే విషయాన్ని పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న బాత్ రూమ్‌లను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



అధికారులతో మాట్లాడుతున్న సిద్ధార్థ్

గిద్దలూరు రూరల్: కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు అందజేయాలని తహసీల్దార్ జి.సిద్ధార్థ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీఆర్‌సీ చట్టం ప్రకారం మండలంలోని ప్రతి కౌలు రైతును గుర్తించి కౌలు గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. మండలానికి 1461 మంది రైతులను గుర్తించి కౌలు గుర్తింపు కార్డులు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారని సూచించారు. ఆ దిశగా ప్రతి అధికారి పనిచేయాలని ఆయన కోరారు. వ్యవసాయశాఖ ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, వీఆర్‌ఓలు, ఉద్యానవనశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కోటి కుంకుమార్చన



పూజల్లో మహిళలు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మి పద్మావతి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మండలం రోజులు సామూహిక కోటి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో పూజలు గురువారం నాటికి ఇరవయ్యో రోజుకు చేరాయి. ఉభయదాతలను ఆలయంలోకి ఆహ్వానించి, శాలువాలతో సత్కరించారు. వారిచే ప్రత్యేక పూజుల చేయిస్తున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ, అనంతరం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, ప్రధాన సలహాదారులు మురళీ కృష్ణమాచార్యులు, కార్యక్రమం నిర్వాహకులు యక్కలి శేషగిరిరావు, పెరుమాళ్ళ భాస్కర్, మేడా నరసింహారావు, ఎస్.నాగేశ్వరరావు, మల్లయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

పరిరక్షణ మండలి అధ్యక్షునిగా ధనరాజ్

పెద్దదోర్నాల: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి మండల అధ్యక్షునిగా వై.చర్లోపల్లికి చెందిన కాకర్ల ధనరాజ్ అలియాస్ దానం గురువారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మండల కమిటీని ఎన్నుకున్నట్లు స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిమూలపు అనిల్‌రాజు తెలిపారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా జిల్లా అధ్యక్షుడు బూదాల గురవయ్య, జిల్లా సెక్రటరీ ఆలేటి నాగయ్య, పెద్దారవీడు అధ్యక్షుడు ఫిలిప్, రాష్ట్ర నాయకులు ఉప్పలపాటి నాగయ్య, స్టేట్ స్పోకెస్ పర్సన్ ఇట్లూరి జయచంద్రరావు పాల్గొని మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎంపికైన కాకర్ల ధనరాజ్ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలను అందేలా కృషి చేస్తానని తెలిపారు.

హామీని టీడీపీ నిలబెట్టుకోవాలి:



మాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరినీ కంభంలోని ఆల్ఫా హైస్కూల్లో చదివిస్తున్నారు. ఒకరు ఐదో తరగతి, మరొకరు రెండో తరగతి చదువుతున్నారు. టీడీపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. రూ.15 వేలు ప్రకారం ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఇస్తామన్నారు. పాఠశాలలు ప్రారంభం కావడంతో ఫీజు కట్టాల్సిన పరిస్థితి ఉంది.

ఎస్.గిరిజ, అంకభూపాలెం, అర్ధవీడు మండలం

నాకు ఇద్దరు పిల్లలు:



నాకు ఇద్దరు పిల్లలు. వారిని ప్రైవేట్ స్కూల్లో చదివిస్తున్నా. ఒకరు ఎనిమిదో తరగతి, చిన్న బ్బాయ్ ఆరో తరగతి చదువుతున్నాడు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికి రూ.15 వేలు ప్రకారం ఇస్తామన్నారు. రూ.30 వేలు వస్తే ఇద్దరి పిల్లల చదువుకు ఆర్థికంగా చేయూతగా ఉంటుందని అనుకున్నా. గతంలో జూన్‌లో డబ్బులు అకౌంట్‌లో జమ చేసేవారు. పాఠశాలలు తెరిచి నెల దాటినా ఈ పథకంపై ఎటువంటి సమాచారం లేదు.

ముమ్మడి లక్ష్మీదేవి, బేస్తవారిపేట

రూ.30 వేల కోసం ఎదురు చూస్తున్నా:



నాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. గతంలో జగనన్న ప్రభుత్వం అమ్మఒడి కింద ఒక్కరికి రూ.15 వేలు అందజేసేది. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి డబ్బులు వేస్తామని చెప్పారు. ఆ లెక్కన తమ ఇద్దరు పిల్లలకు డబ్బులు ఒక్కొక్కరికి రూ.15 వేలు ప్రకారం రూ.30 వేలు ఎపుడు వేస్తారా అని ఎదురు చూస్తున్నా.

పసుపుల ఫాతిమా, గిద్దలూరు.

టీడీపీ ఇంటింటా ప్రచారం చేసింది:



నా భర్త కూలి పనిచేస్తాడు. నాకు ముగ్గురు అమ్మాయిలు. ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. గతంలో ఒకరికి అమ్మఒడి డబ్బులు బ్యాంక్ ఖాతాలో పడేవి. టీడీపీ ఇంటింటా ప్రచారం చేసేటప్పుడు ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామన్నారు. ఇంత వరకు ఈ పథకం ఎప్పుడు అమలు చేస్తారో చెప్పలేదు. డబ్బులు పడితే పిల్లలకు బట్టలు, పుస్తకాలు, వస్తువులు కొనుక్కోవడానికి ఉపయోగపడతాయని ఎదురు చూస్తున్నాం. గతంలో అమ్మఒడి డబ్బులు పాఠశాలలు ప్రారంభంలోనే ఇచ్చేవారు. ప్రభుత్వం వెంటనే తల్లికి వందనం డబ్బులు విడుదల చేయాలి.

బొడిచర్ల భవాని, కంభం

చంద్రబాబు నయవంచన



కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన తల్లికి వందనం హామీ

చెప్పింది చెయ్యనే చెయ్యరు.. ఎప్పుడూ అంతే:



పిల్లల చదువుల కోసం గత ప్రభుత్వం టంచన్‌గా స్కూలు తెరిచే సమయానికి అకౌంట్లో తల్లి పేరున నగదు జమ అయ్యేది. కూటమి ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటుంటే అంత మందికి రూ. 15వేల చొప్పున వేస్తామని లెక్కలు గట్టి మరీ ఊదరగొట్టి చెప్పారు. ఇప్పుడేమో ఒకరికే ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఆ ఒక్కరికి కూడా ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. హామీ ఇచ్చి ఆ తరువాత దానిని అమలు చే

వెలుగు సుశీల, ఈగలపాడు (పొదిలి)

హామీ నిలబెట్టుకోవాలి:



గత ప్రభుత్వంలో చదువుకునే పిల్లలకు ప్రతి ఏడాది పాఠశాలలు ప్రారంభించిన తరువాత వెంటనే అమ్మ ఒడి పథకం ద్వారా తల్లుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల హామీలో అమ్మ ఒడి పథకంలాగే ‘తల్లికి వందనం’ పేరిట చదువుకునే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ప్రకారం ఇంట్లో ఎంతమంద చదువుతుంటే అందరికీ ఇస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అయితే ఎప్పుడు హామీలు అమలు చేకయుండా ఇంట్లో ఒక్కరికే పథకం వర్తిస్తుందని జీఓ ఇవ్వటం మోసం చేయటమే. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రస్తుత మంత్రులు పవన్ కల్యాణ్, లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం పథకం వర్తించేలా చేయాలని కోరతున్నాం.

జి.దుర్గ, వెలుగొండ్రాయునిపల్లి (కొనకనమిట్ల)

బేస్తవారిపేట: టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలో ‘సూపర్ సిక్స్’లో ఇంటింటికీ తిరిగి తల్లికి వందనం పేరుతో చంద్రబాబు సీఎం అయిన వెంటనే ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికి ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని ప్రచారం చేశారు. టీడీపీ–జనసేన ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి ప్రముఖంగా ప్రచారం చేశారు. ప్రైవేట్ స్కూల్లో చదివే పిల్లల తల్లిదండ్రులు వేలకు వేలు ఫీజు చెల్లించాలి.. పుస్తకాలు, యూనిఫామ్స్ చెప్పిన ధరకే కొనివ్వాలి.. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు దాటింది.. ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ ఇచ్చిన హామిని నెరవేరిస్తే పిల్లల ఫీజులకు ఉపయోగపడుతుందని తల్లులు ఎదురు చూస్తున్నారు. ఇచ్చిన మాట తప్పకుండా ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేల చొప్పున ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇద్దరు ఉంటే రూ.30 వేలు, ముగ్గరు పిల్లలు ఉంటే రూ.45 వేలు వస్తే పిల్లల ఫీజులకు, చదువుల ఖర్చుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న తల్లులకు నేటి వరకు ఈ ప్రభుత్వం ఈ పథకం విధి విధానాలే ప్రకటించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

కాశమ్మకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు



కాశమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

పొదిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రావణి వెంకటేశ్వర్లు మాతృమూర్తి వెలిశెట్టి కాశమ్మ ఇటీవల మృతి చెందారు. గురువారం పెద్ద కర్మ కార్యక్రమాలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి కార్యక్రమంలో పాల్గొని కాశమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కాశమ్మ ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. నివాళులర్పించిన వారిలో కొనకనమిట్ల మండల ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటరెడ్డి, వివేకానంద విద్యా సంస్థల డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, జి.శ్రీనివాసులు, యక్కలి శేషగిరిరావు, తాడికొండ వెంకటరావు, వరికుంట్ల అనిల్ (పండు), శాసనాల వీరబ్రహ్మం, అయినాబత్తిని ఘనశ్యాం, మంత్రి శ్రీనివాసులు, అందె నాసరయ్య, కంభాలపాడు మాజీ సర్పంచ్ పులిగొర్ల శ్రీనివాసరావు, నాగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పలు పార్టీల నాయకులున్నారు.

బాల్య వివాహాలు అరికట్టండి



కొనకనమిట్ల: జెడ్పీ పాఠశాల బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

కొనకనమిట్ల: కౌమార దశలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలపాలని, బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుధామారుతి బాలికలకు అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికలకు చదువుకునే దశలో వారు పాటించాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. రక్తహీనత గురించి తెలియజేశారు. బాల్య వివాహాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తారన్నారు.

అంగన్‌వాడీలు ఆనంద నిలయాలు

అంగన్‌వాడీ కేంద్రాలను ఆనంద నిలయాలుగా మార్చాలని సీడీపీఓ సుదామారుతి అన్నారు. గురువారం గొట్లగట్టులో అంగన్‌వాడీ కార్యకర్తల సెక్టార్ కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్రాలకు సరఫరా చేస్తున్న సదుపాయాలన్నీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, కార్యకర్తలు పద్మ, నారాయణమ్మ, కవిత పాల్గొన్నారు.

మహాపర్వదినం గురుపౌర్ణమి



బాబాకు అభిషేకం చేస్తున్న దృశ్యం



అఖండ పారాయణం చేస్తున్న మహిళా భక్తులు

మార్కాపురం: గురుపౌర్ణమి మహా పర్వదినమని సాయి ఉపాసకులు, ప్రముఖ సాయితత్వ ప్రచారకులు, సాయిదాస్ శ్రీశైలం అన్నారు. పట్టణంలోని నెహ్రూబజారు శ్రీ షిరిడీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న సాయి సప్తాహ ప్రవచనాల్లో భాగంగా గురువారం చివరిరోజు శ్రీశైలం మాట్లాడారు. శ్రీ మహావిష్ణువు అంశగా జన్మించిన వ్యాస భగవానుడు జన్మించిన రోజున వ్యాస పౌర్ణమి అని, జగద్గురువులు అయిన వేద వ్యాసుడు జన్మించిన రోజు గురువులను పూజించడం గురు సంప్రదాయమని సాయిబాబా భక్తులకు పరోక్షంగా వివరించారన్నారు. దీనితో గురుపౌర్ణమిరోజు గురువును పూజించడం ఆచారంగా వస్తుందని, బాబా భక్తులందరూ గురుపౌర్ణమి రోజున బాబాను పూజించాలని, ఆయన సూక్తులను పాటించాలని తెలిపారు. సాయిబాబా జీవిత చరిత్ర అఖండ పారాయణం ప్రారంభించారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి వచ్చే గురువారం 6 గంటల వరకూ అఖండ పారాయణం జరుగుతుందన్నారు. కాగా బాబాకు గురువారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు చేసి బాబాను పూలమాలలతో అలంకరించారు. పలువురు భక్తులు పూజల్లో సాయి ప్రవచనాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మందిర అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు, వైస్ ప్రెసిడెంట్ ఆర్. గోపి, కోశాధికారి నాగరాజు, కమిటీ సభ్యులు, కృష్ణమోహన్, కరీమ్, గోపిశెట్టి కొండయ్య, రంగ ప్రసాద్, బాలాజీ, మధు, మస్తాన్ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



లక్ష్మీ చైతన్య



నాగశ్వేత

మార్కాపురంటౌన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసిన డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో సాధనా డిగ్రీ కళాశాల విద్యార్థులు 92 శాతం సగటు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ కె. మధుసూదన్ తెలిపారు. కళాశాలకు చెందిన బీఎస్సీ (బీజెడ్‌సీ) విభాగంలో కె. లక్ష్మీ చైతన్య (934 / 1000), బీఎస్సీ (ఎంపీసీ) విభాగంలో ఇ. నాగశ్వేత (837/900), బీఎస్సీ (యంయస్‌సీయస్) విభాగంలో షేక్ సజనా (836/900), బీకాం కంప్యూటర్స్ విభాగంలో సీహెచ్ గౌరీ తనూజ (676/800), బీఎస్సీ (ఎంపీసీ) విభాగంలో వైవీ శివసాయికుమార్ (627/900) మార్కులు సాధించారని తెలిపారు. గణితంలో నలుగురు విద్యార్థులు 100 శాతం మార్కులు సాధించారని, వివిధ సబ్జెక్టుల్లో 223 పేపర్లలో 90 శాతంకు పైగా మార్కులు సాధించారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ డి. రాజగోపాల్ రెడ్డి, డైరెక్టర్లు వీఆర్‌కే ప్రసాద్, ఎన్‌వీ కృష్ణారెడ్డి, వెన్న కృష్ణారెడ్డి, జీఎల్ రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్, ప్లేస్‌మెంటు సెల్ అధికారి పవన్‌కుమార్, శేషుకుమార్, రామకృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కౌలు కార్డులపై అవగాహన సదస్సు

కంభం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కౌలుకార్డులపై అవగాహన సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి స్వరూప, తహసీల్దార్ రామయ్య మాట్లాడుతూ మండలానికి 1023 కార్డులను ఈ సంవత్సరానికి టార్గెట్ ఇచ్చారని, దీనిలో భాగంగా ప్రతి గ్రామంలో షెడ్యూలు వేసుకొని రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సంచాలకులు మండల స్థాయి అధికారులు సమావేశాల్లో పాల్గొంటారని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మార్కాపురం: నంద్యాల జిల్లా పగిడాల మండలం మచ్చుమర్రి గ్రామానికి చెందిన చిన్నారి వాల్మీకి వాసంతిని అత్యాచారం చేసి ఆపై హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లా వాల్మీకి మహర్షి ఉత్సవ సంఘం మార్కాపురం కమిటీ ప్రతినిధులు, న్యాయవాది భూపని కాశయ్య, నల్లబోతుల కొండయ్య, అచ్చయ్య, బోగెం కాటంరాజు డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. 8 సంవత్సరాల చిన్నారి వాసంతిని హత్యచేసిన నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంఘటన చాలా అమానుషమని భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి సంఘటనలు చేయకుండా కఠినమైన శిక్షలను అమలు చేయాలన్నారు. లేదంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. నాదగురుబ్రహ్మం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

పొదిలి: నగర పంచాయతీ పరిధిలో పరిసరాల పరిశుభ్రతపై కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. పరిసరాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ సమస్య తీవ్రతను తెలుసుకుంటున్నాడు. త్వరితగతిన స్పందిస్తూ వీధులను పరిశుభ్రం చేయిస్తున్నారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్థానికులతో మాట్లాడి సమస్యలు పరిష్కారం అయ్యేలా చేస్తున్నారు. మొదటి లైను క్రాస్ రోడ్డులో చెత్త, మట్టి కుప్పలు పేరుకపోయి ఆ రోడ్డున నడిచేందుకే ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం వెంటనే పొక్లెయిన్ ద్వారా మట్టి కుప్పలను తొలగించారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయించారు. స్థానికులు చెత్తను నగర పంచాయతీ రిక్షాలు, ట్రాక్టర్‌లలో వేయాలని లేదా నిర్ణయించిన ప్రదేశంలో మాత్రమే చెత్త వేయాలని కమిషనర్ చంద్రశేఖరరెడ్డి కోరారు.

సాగు హక్కు పత్రంపై అవగాహన

రాచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ భారతీబాయ్ అధ్యక్షతన గురువారం వీఆర్‌వోలకు సాగు హక్కు పత్రం (సీసీఆర్‌సీ)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ మాట్లాడుతూ కౌలుకు పొలం తీసుకుని సాగు చేసుకునే రైతులను గుర్తించి వారికి పంట సాగు హక్కు పత్రం ఇవ్వాలని వివరించారు. సాగు హక్కు పత్రం తీసుకుంటే పంట నమోదు కార్యక్రమం వారి పేరు మీద జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం పథకాలు, సబ్సిడీలకు, అలాగే పంట రుణం తీసుకోవాలన్నా, పంట మద్దతు ధరకు అమ్ముకోవాలన్నా, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం సంభవించినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ రావాలన్నా కౌలు రైతు కార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. సాగు హక్కు పత్రం కాలపరిమితి 11 నెలలు మాత్రమేనని వివరించారు. సాగు హక్కు పత్రం కావాల్సిన వారు భూమి యజమాని పాస్‌బుక్, ఆధార్‌కార్డు, కౌలు రైతు ఆధార్‌కార్డు, రెండు పాస్‌బుక్ ఫొటోలు, కౌలు రైతు బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్‌లు తీసుకుని పంట హక్కు పత్రాలను ఇవ్వాలని వీఆర్వోలకు తెలియజేశారు. కార్యక్రమంలో 14 పంచాయతీల వీఆర్వోలు పాల్గొన్నారు.

కౌలురైతుకు తప్పనిసరిగా కౌలుకార్డు ఇవ్వాలి

కొమరోలు: ప్రతి ఒక్క కౌలురైతుకు తప్పనిసరిగా కౌలు కార్డులు ఇవ్వాలని తహసీల్దార్ మల్లికార్జున నాయుడు తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో కౌలు కార్డులు జారీ చేసే కార్యక్రమంపై తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బందికి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్.మల్లికార్జుననాయుడు మాట్లాడుతూ సీసీఆర్‌సీ చట్టం ప్రకారం మండలంలోని ప్రతి కౌలు రైతుకు కౌలు కార్డులు ఇవ్వాలన్నారు. దీనికి సంబంధించిన అంశంపైన ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి కౌలు కార్డులు ఇవ్వాలని తెలిపారు. కౌలు కార్డు కాలపరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందని చెప్పారు. కౌలుదారులకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని, భూమి మీద ఎటువంటి హక్కు ఉండదన్నారు. కౌలుకు ఇవ్వడంలో భూయమజానులు ఎటువంటి భయాలు చెందవద్దన్నారు. మండల వ్యవసాయాధికారి రాజశ్రీ,, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మార్కాపురం: యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఐవైఎం అధ్యక్షుడు ఇస్మాయిల్ అన్నారు. గురువారం స్థానిక ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ (ఐవైఎమ్) మార్కాపురం ఇస్లామిక్ లైబ్రరీ ఆఫీసులో వారు వాల్‌పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. దేశంలోని యువత 60 శాతానికి పైగా ఉన్నారని, సమాజ సంస్కరణలో ముందుండాల్సిన యువత నేడు చెడు వ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఐవైఎం సమాజంలో శాంతిని నెలకొల్పడం, మంచి అలవాట్లు పెంచి సమాజ సమగ్రతను పెంపొందించడమే సంస్థ లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా యువకుల్లో నైపుణ్యాలు, సామాజిక సేవా కార్యక్రమాలపై 10 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఐహెచ్ జిల్లా అధ్యక్షుడు అష్రఫ్ అలీ, పట్టణ అధ్యక్షుడు సికిందర్, ఐవైఎమ్ పట్టణ అధ్యక్షుడు తలహా, కార్యకర్తలు రసూల్, మాబు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆదర్శ యువత – ఆదర్శ సమాజం పోస్టరు ఆవిష్కరించారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు



మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మావతి

బేస్తవారిపేట: కౌలు రైతులందరికీ సీసీఆర్‌సీ (సాగుదారు హక్కు పత్రం) మంజూరు చేయనున్నట్లు తహసీల్దార్ పద్మావతి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వీఏఏలతో పంట సాగుదారు హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంట రుణాలు, బీమా పథకం, అన్నదాత సుఖీ భవ, ఇన్‌పుట్ సబ్సిడీ పొందటానికి సాగుదారు హక్కు పత్రం ఉంటే అర్హత ఉంటుందన్నారు. భూ యజమాని కౌలు రైతులకు పొలం ఇవ్వడంతో కేవలం సాగు చేసిన పంటలపై మాత్రమే హక్కు ఉంటుందన్నారు. మండలంలోని అన్నీ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని, కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులకు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. వ్యవసాయాధికారి జక్కం మెర్సీ, డీటీ పాల్గొన్నారు.

అందుబాటులో ప్రభుత్వ వైద్యుల వివరాలు

మార్కాపురం: స్థానిక గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో పని చేసే వైద్యులు పేర్లు, ఫొటోతో పాటు వారు పని చేసే విభాగాలు, హోదాలతో కూడిన పట్టికను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి, డాక్టర్ నాగరాజు తెలిపారు. కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

రాయితీపై కంది విత్తనాల పంపిణీ

కొనకనమిట్ల: అవసరమైన రైతులకు 30 శాతం రాయితీపై కంది విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు స్థానిక ఏఓ ప్రసన్న రంగలక్ష్మి తెలిపారు. మండలానికి 50 క్వింటాళ్ల కంది విత్తనాలు మంజూరయ్యాయన్నారు. ఎల్‌ఆర్‌జీ 52 రకం కంది విత్తనాలు కిలో రూ.139 రూపాయలు ఉండగా సబ్సిడీ పోను రూ.97 రూపాయలు రైతులు చెల్లించాలన్నారు. కంది విత్తనాలు అవసరమైన రైతులు తమ పరిధిలోని రైతు సేవాకేంద్రాల్లో సంప్రదించి గ్రామ వ్యవసాయశాఖ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

తూనికలు, కొలతల శాఖాధికారుల తనిఖీలు



కాటాను పరిశీలిస్తున్న అధికారి రియాజ్

కంభం: నిబంధలను ఉల్లంఘించి విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని మార్కాపురం తూనికలు, కొలతలశాఖ అధికారి రియాజ్ హెచ్చరించారు. పట్టణంలోని రిలయన్స్ మార్ట్, బేకరీలు, కిరాణా షాపులు, ఇతర దుకాణాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 5 షాపులపై కేసులు నమోదు చేసి రూ.18500/ జరిమానా విధించినట్లు చెప్పారు. అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారన్న విషయాన్ని తెలుసుకొని చౌక్ సెంటర్, బస్టాండులోని దుకాణ దారులు తమ దుకాణాలను మూసివేసారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యాపారాలు నిర్వహించాలని, గడువు ముగిసిన వస్తువులు విక్రయించరాదని, తూకాల్లో తేడా ఉండకూడదని సూచించారు. తనిఖీలు చేసినప్పుడు పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జనాభా నియంత్రణ ముఖ్యం



రాయవరం వద్ద ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

మార్కాపురం రూరల్: జనాభా నియంత్రణకు సమాజంలోని ప్రతిఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని గజ్జలకొండ పీహెచ్‌సీ డాక్టర్ సాయిచరణ్ తేజ కోరారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా రాయవరంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బిడ్డకు బిడ్డకు మధ్య వ్యవధి పాటించాలని అందుకు అవసరమైన తాత్కాలిక గర్భనిరోధక సాధనాలు వాడుకోవాలన్నారు. ఒక బిడ్డ ముద్దు, ఇద్దరు వద్దు అనే విధానాన్ని పాటించాలన్నారు. దీని ద్వారా జనాభా నియంత్రణతో పాటు ప్రతి స్త్రీ ఆరోగ్య వంతంగా ఉంటుందని వివరించారు. హెచ్ఈఓ బి. శ్రీకాంత్, విమల, పెద్దన్న, కాశయ్య పాల్గొన్నారు.